ఆంధ్రజ్యోతి
నాగర్‌కర్నూల్
మంగళవారం 15 అక్టోబరు 2024

పకడ్బందీగా అమలు చేయాలి

- ప్రధానమంత్రి బీమా యోజనపై బ్యాంకర్లు నిర్లక్ష్యం వీడాలి
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి : ఎంపీ మల్లురవి

వనపర్తి అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు అమలు చేయడంలో బ్యాంకర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారని వనపర్తి జిల్లా దిశ కమిటీ చైర్మన్, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. సోమవారం వనపర్తి కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావే శానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మొదటగా బ్యాంకర్ల ద్వారా నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, వాటి లక్ష్య సాధనకు సమీక్ష నిర్వహించారు. ఒక్కో బ్యాంకుకు నిర్దేశించిన లక్ష్యాలు, సాధించిన అంశాలపై లీడ్ బ్యాంకు మేనేజర్, బ్యాంక్ మేనేజర్‌లను వివరాలు అడిగారు. ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి పథకానికి కేవలం సంవత్సరానికి రూ.430 చెల్లిస్తే రూ.2 లక్షల జీవిత బీమా వస్తుందని, అదే ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకంలో సంవత్సరానికి కేవలం రూ.20 చెల్లిస్తే పాక్షిక అంగవైకల్యం జరిగితే లక్ష రూపాయలు, శాశ్వత అంగవైకల్యం ఏర్పడితే రూ.2 లక్షల బీమా వర్తిస్తుందని తెలిపారు. అటల్ బీమా యోజన పెన్షన్ స్కీం

-మిగతా 7వ పేజీలో...


సమావేశంలో మాట్లాడుతున్న దిశ చైర్మన్, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి

అడవులు, వన్యప్రాణుల అభివృద్ధికి కృషి


బొలెరో వాహనాన్ని ప్రారంభిస్తున్న ఏలూసింగ్ మేరూ

మన్ననూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వరల్డ్‌వైడ్ ఫండ్ నేచర్ (డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్) వారి సహకారంతో రాష్ట్రంలోని అడవులు, వన్య ప్రాణుల సంర క్షణకు కృషి చేస్తున్నామని రాష్ట్ర అటవీశాఖ చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ ఏలూసింగ్ మేరూ అన్నారు. డబ్ల్యూడబ్ల్యూఎఫ్ వారి ఆర్థిక సాయంతో అందజేసిన బొలెరో వాహనాన్ని మన్న నూరు అటవీ పర్యావరణ విజ్ఞాన కేంద్రం ఆవరణలో సోమ వారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావే శంలో ఆయన మాట్లాడారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ ద్వారానే మాన వ మనుగడ సాధ్యపడుతుందన్నారు. వరల్డ్‌వైడ్ సంస్థ అటవీ శాఖకు ఆర్థిక వనరులను సమకూర్చడం అభినందనీయమని, వారితో కలిసి రాష్ట్రంలోని అడవుల్లో పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపడుతున్నామని అన్నారు. 2005లో నల్లమల ప్రాంతంలోని పర్హాబాద్ వద్ద సౌరశక్తి బోర్ వేసి వన్యప్రాణులకు తాగునీటి సరఫరాకు శ్రీకారం చుట్టారని అన్నారు. అడవుల్లో పెద్దపులుల కదలి కలు తెలుసుకునేందుకు, స్మగ్లర్లు, వేటగాళ్లు అడవుల్లో చేసే నేరాలను అదుపు చేసేందుకు మెటల్ డిటెక్టర్లు, సీసీ ట్రాప్ కెమెరాలు, వాకీటాకీలు, జీపీఎస్ యూనిట్లు అందజేస్తున్నారని అన్నారు. అడవుల్లో జరిగే ప్రతీ ఘటనకు సంబం ధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు వైర్‌లెస్ టవర్ల నిర్మాణం చేపట్టారని అన్నారు. అమ్రాబాద్ అభయారణ్యంలో పెద్దపులుల సంఖ్య గణనీయంగా పెరుగుదలకు కృషి చేసిన అధికారులను, అటవీ ప్రొటెక్షన్ వాచర్లను అభినం దించారు. ఇదే స్ఫూర్తిని మున్ముందు ప్రదర్శించాలని కోరారు. ఏపీ, తెలంగాణ విడిపోయిన తర్వాత డబ్ల్యూడబ్ల్యూఎఫ్ సహకారం తగ్గిందని, మున్ముందు సహకారం పెరగాల్సిన అవసరం ఉందని ఆ సంస్థ ప్రతినిధులకు విన్నవించా రు. కార్యక్రమంలో డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్ ఏపూర్, అటవీ క్షేత్ర సంచాలకులు(ఎఫ్‌డీ) శివాని డోగ్రా, డీఎఫ్‌వో రోహిత్ గోపిడి, ఎఫ్‌డీవో రామమూర్తి, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ డైరెక్టర్ ఫరీదా టాంపాల్, ప్రతినిధి శ్రీనివాస్, రేంజ్ అధికారులు దేవజ, గురుప్రసాద్ ఉన్నారు.

రెండ్రోజుల్లో కొనుగోలు చేస్తాం

- మిల్లును పరిశీలించిన మార్కెట్ కార్యదర్శి ఎల్లస్వామి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అలంపూర్ చౌరస్తా, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అలంపూర్ నియోజకవర్గం లో రెండ్రోజుల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని అలంపూర్ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి ఎల్లస్వామి తెలి పారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'పత్తిని కొనే దెప్పుడు' అనే శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పం దించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం కార్యదర్శి ఎల్లస్వామి, ఆసిస్టెంట్ కార్యదర్శి శ్రీనివాస్‌లు ఉండవల్లి శివారులోని జాతీయ రహదారి పక్కనున్న వరసిద్ధవినాయక పత్తిమిల్లును పరిశీలించారు. రెండ్రోజుల్లో కొను గోళ్లు ప్రారంభిస్తామని ఆంధ్రజ్యోతికి తెలిపారు. కొనుగోలు కేంద్రాన్ని ప్రయి వేటు పత్తి మిల్లులో ఏర్పాటు చేయనున్నామని, అందుకనుగుణంగా ఆవస రమైన ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. పరిశీలించన వారిలో అగ్రిమాపక అధికారి అశోక్‌కుమార్, మార్కెట్‌యార్డు అధికారులు ఉన్నారు.


మానవపాడు మండలం బోరవెల్లి చెన్నకేశవస్వామి ఆలయం

హే..కేశవా మన్నించు

ఇతరుల చేతుల్లో బోరవెల్లి చెన్నకేశవస్వామి ఆలయ భూములు

- గ్రామంలో ఇష్టారాజ్యంగా ఖిద్మతి ఇనాం భూముల విక్రయం
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్‌లు.. గ్రామ పెద్దకు భాగం
- అడిగినంత ఇస్తే దేవుడి భూమికైనా యథేచ్ఛగా వోఆర్‌సీలు జారీ
- కారుచౌకగా కొనుగోలు.. వోఆర్‌సీల ద్వారా మ్యూటేషన్లకు పైరవీలు
- భూములు అమ్ముకుంటున్న అనుభవదారులు.. అర్థాకలిలో అర్చకులు

మహబూబ్‌నగర్, ఆంధ్రజ్యోతి ప్రతినిధి/అలంపూర్ చౌరస్తా, అక్టోబరు 14: జోగులాంబ గద్వాల జిల్లాలో ఆల యాల భూములు అంగట్లో సరుకుగా మారుతున్నాయి. జిల్లాలోని మానవపాడు మండలం బోరవెల్లి గ్రామంలో గద్వాల సంస్థాన స్థాపకుడైన నలసోమనాద్రి చెన్నకేశవ స్వామి ఆలయాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిం చారు. దూపదీప నైవేద్యాల కోసం గ్రామంలోని సర్వే నెంబర్ 240/ఏ, 241, 269, 270/ఏ, 270/బీ, 294, 295లో మొత్తం కలిపి 62.26 ఎకరాలను కేటాయించారు. ఈ భూములన్నింటికి దేవుళ్ల పేర్లపై ఓఆర్‌సీలు సైతం జారీ అయ్యాయి. ఖిద్మతిఇనాం భూములుగా 1953-1955 ఖాస్ర పహాణీలో నమోదై ఉన్నాయి. 1955 చట్టం ప్రకారం ఈ భూములను విక్రయించడానికి వీలు లేదు. గతంలో ఆ భూముల ద్వారా వచ్చే పైకంతో కైంకర్యాలు బాగా నిర్వ హించేవారు. కానీ క్రమేణా కౌలు చేస్తున్న రైతులు కూడా పైకం అరకొరగా చెల్లించడం, కొందరు చెల్లించక పోవడం, ఎండోమెంట్ అధికారుల పర్యవేక్షణ లేకపోవ డంతో అనుభవదారులు భూముల విక్రయాలకు

మిగతా 7వ పేజీలో...

ఆనాటి రాజులు, భూస్వాములు ఆలయాల బాగు కోసం, దూపదీప నైవేద్యాల కోసం ఆలయా లకు భూములను అప్పగించారు. అయితే అందరికీ అభయమిచ్చే ఆ దేవుడి భూములనే కొందరు కాజేస్తున్నారు. భూములపై ఆధార పడి జీవించాల్సిన వారు.. వాటిని విక్రయించి ఆలయాల ఉనికినే లేకుండా చేస్తున్నారు. భూములను పరిరక్షించాల్సిన అధికారులు వీరి కంటే ఒక అడుగు ముందుకేసి చేయిచాస్తు న్నారు. అడిగినంత చేతిలో పెడితే ఆలయ భూములను బదలాయించే ధ్రువపత్రాలను జారీ చేస్తున్నారు. ఇలా మొన్న చెన్నిపాడులో.. నిన్న పెద్దదిన్నెలో.. తాజాగా బోరవెల్లిలో ఆలయ భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్ట బెట్టేందుకు ఓఆర్‌సీలను జారీ చేస్తూనే ఉన్నారు.

ఇంటర్వ్యూ..



శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

- ఆంధ్రజ్యోతితో ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. గుర్తుతెలియని వ్యక్తు లు ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వారి ఖాతాలో డబ్బు మాయం చేస్తున్న సంఘటనలు నిత్యం జరుగుతు న్నాయి. పోలీస్ అధికారుల పేరుతో కూడా ప్రజలను భయాందోళనకు గురిచేసి నేరా లకు పాల్పడుతూ తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని శాంతి భద్రతల పరి రక్షణకు కృషిచేస్తామని ఎస్పీ శ్రీనివా సరావు ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో వెల్లడించారు.

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది జిల్లాలో సైబర్ నేరాలు సంఖ్య ఎలా ఉన్నది.

జోగులాంబ గద్వాల జిల్లాలో 2024 జన వరి నుంచి నేటి వరకు 61 సైబర్ కేసుల కు సంబంధించి రూ. 12,29,342లు కాజేశారు. రూ. 7,51,744లను కోర్టు ద్వారా ఫ్రీజ్ చేయించాం. రూ. 25వేల లోపల పోగుట్టుకుంటే ఎఫ్ఐఆర్ లేకుండా నేరుగా పోలీసులు రికవరి చేసి బాధితులకు అప్ప గించవచ్చు. అంతకన్నా ఎక్కువ పోతే ఎఫ్ఐఆర్ నమోదుతో పాటు ఫ్రీజ్ చే యించి కోర్టు ద్వారా అనుమతి పొంది బాధితులకు ఇవ్వాల్సి ఉంటుంది.

సైబర్ నేరాల విషయంలో ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

సైబర్ నేరాల నియంత్రణకు ప్రజలను చైతన్యం చేయడం ముఖ్యం. యువత సెల్‌ఫోన్‌లో కొత్త వ్యక్తులు చెప్పేమాట లకు మోసపోవద్దు. కొత్త యాప్‌లపై అప్రమ్మంగా ఉండాలి. బాలికలు, మహిళలు తమ ఫొటోలను సోషల్ మీడి యాలో ఉంచరాదు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1903కి కాల్ చేయాలి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సైబర్ నేరాల నియంత్ర ణకు ప్రత్యేక డీఎస్పీ ర్యాంక్ అధికారిని నియమించింది.

పోలీస్ అధికారుల పేరుతో చేస్తున్న మోసాలు నిజమేనా..?

ఇటీవల సైబర్ నేరస్థులు తాము పోలీస్ ఉన్నతాధికారులమంటూ వాట్సాప్ డీపీగా ఒక పోలీస్ అధికారి ఫొటో పెట్టుకొని వాట్సాప్ కాల్ చేసి కుటుంబ సభ్యులను భయపెడుతున్నారు. కొత్త వ్యక్తుల నుంచి ఫోన్‌కాల్ వస్తే వెంటనే పోలీసులను ఆశ్రయించాలి.


ఎదురు చూపులు

- నామినేటెడ్ పోస్టులపై నాయకుల ఆశ
- బీసీ కులగణన నేపథ్యంలో ఆలస్యం కానున్న స్థానిక సంస్థల ఎన్నికలు
- అధికార పార్టీ ఎమ్మెల్యేలపై పెరుగుతున్న ఒత్తిడి

నాగర్‌కర్నూల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమవుతున్న కొద్దీ అధికార పార్టీ ఎమ్మెల్యేలపై నామినేటెడ్ పోస్టుల ఒత్తిడి అధిక మైంది. దాదాపు పదేళ్ల తరువాత కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడానికి కృషి చేసిన నాయకులను సమన్వయపర్చడం, వారికి సముచిత స్థానం ఇవ్వడం లో ఎటూ తేల్చుకోలేక ఎమ్మెల్యేలు సతమతమవుతు న్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో అచ్చంపేట, నాగర్ కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో అధికా ర పార్టీ ఎమ్మెల్యేలు గెలవడం, కొల్లాపూర్ జూపల్లి కృష్ణారావు రాష్ట్ర క్యాబినేట్‌లో మంత్రిగా కొనసాగుతున్న విషయం తెలిసిందే.

కాంగ్రెస్ మద్దతుదారుల్లో అసంతృప్తి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు పది నెలలు దాటినా ఇప్పటి వరకు పార్టీ పట్ల నిబద్ధతతో పని చేసిన వారికి పదవులు దక్కకపోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. పోలీస్ కేసులు ఎదుర్కొని గత ప్రభుత్వానికి దీటుగా తలపడిన తనకు టెలికాం బోర్డు అడ్వయిజరీ కమిటీ మెంబరుగా నియమించడం పట్ల పీసీసీ సభ్యుడు కొలను వల్లపురెడ్డి తీవ్ర అసంతృ ప్తితో ఉన్నారు. జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఉన్న హబీబ్‌కు రాష్ట్రస్థాయిలో మైనార్టీ పోస్టు ఇప్పిస్తామని ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ అధిష్ఠానం హామీ ఇచ్చింది. ఇప్పటి వరకు అతనికి సర్దుబాటు చేయక పోవడం, కనీసం తాలుకా స్థాయిలో కూడా ఎలాంటి పదవి దక్కకపోవడం పట్ల అసంతృప్తితో ఉన్నారు. గడిచిన శాసన సభ ఎన్నికల్లో పోలింగ్ వరకు బీఆర్ ఎస్ వెంట తిరిగిన నేతలు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే నాలుగు నియోజకవర్గాల్లోని అధికార పార్టీ నేతలకు అంటకాగడం నిజమైన కాంగ్రెస్ కార్య కర్తలకు, నాయకులకు మింగుడు పడడం లేదు.



పని చేసిన వారికే పదవులు

నామినేటెడ్ పదవులు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎవరూ తన వద్దకు వచ్చిన పార్టీ కోసం పని చేసిన వారికే ప్రాధాన్యతను కల్పిస్తా నని కూచకుళ్ల దామోదర్‌రెడ్డి స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలో కొందరు రియల్ ఎస్టేట్ మాఫియాకు చెందిన కౌన్సిలర్లు తమను పార్టీలోకి తీసుకుని తనకు కౌన్సిలర్ టికెట్ ఇస్తే మరో నలుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లకు ఎన్నికల్లో గెలుపొందడానికి ఆర్థిక సహా యం కూడా చేస్తానని మధ్యవర్తులతో రాయబారం పంపిస్తే ఇందుకు కూచకుళ్ల దామోదర్‌రెడ్డి నిక్కచ్చిగా ఖండించినట్లు సమాచారం.


డీసీసీకి అధ్యక్షుడు కావలెను

నామినేటెడ్ పోస్టులతో పాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవితోపాటు కార్యవర్గానికి కూడా డిమాండ్ ఏర్పడింది. పదేళ్ల పాటు డీసీసీ పదవి అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాలను సమన్వయంపర్చుకునే చిక్కుడు వంశీకృష్ణ స్థానంలో కొత్తవారిని నియమించే యోచనలో కాంగ్రెస్ అధిష్ఠానం లేనట్లు తెలుస్తోంది.

ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలి

- ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పోలీస్ ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. సోమ వారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణిలో భాగంగా ఫిర్యాదు దారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజావాణి ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా పోలీసు అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశిం చారు. ప్రజావాణికి మొత్తం ఆరు ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. అంతకు ముందు ఇటీవలే పోక్సో కోర్టు పీపీ శ్రీనివాసాచారి, జిల్లా కోర్టు పీపీ గోపాల్ రెడ్డితో కలిసి ఎస్పీని కలిశారు. ఎస్పీ మాట్లాడుతూ... పీపీలు జిల్లా పోలీస్ అధికారులు, కోర్టు కానిస్టేబుల్స్ సమన్వయంతో బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు.



ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.
మహబూబ్‌నగర్ : 9985411175, 9985403259
నాగర్‌కర్నూల్ : 9985410905
వనపర్తి : 9985403242
గద్వాల : 9985403238
నారాయణపేట : 9985411463
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9985411365

భక్తిశ్రద్ధలతో ఉత్సవమూర్తుల ఊరేగింపు


శివపార్వతుల ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

అచ్చంపేట అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఉత్తర ముఖ ద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో శివపార్వతుల ఉత్సవమూర్తుల ఊరేగిం పు సోమవారం వైభవంగా నిర్వహించారు. భక్తు లు ముందుగా పాపనాషిని గుండంలో పుణ్య స్నానాలు ఆచరించి ఈశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు రామూర్తి, వీరయ్య, రాజశేఖర్ ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పా టు చేసిన పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తు లకు కుంకుమార్చనలు చేశారు. అనంతరం సా యంత్రం పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తుల ను పాపనాషిని గుండంలో పుణ్యస్నానాలు, చక్ర స్నానాలు చేయించారు. అనంతరం ఆలయానికి తీసుకు వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, హైదరాబాదు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల నుంచి శ్రీశైలం వెళ్లే భక్తులు ఉమామహేశ్వరుడిని దర్శిం చుకొని మొక్కులు తీర్చుకున్నారు.



న్యూస్ బాక్స్

ఆటో డ్రైవర్ నిజాయతీ

- ప్రయాణికుడు మరిచిన బ్యాగు అందజేత



యజమానికి బ్యాగును అందచేస్తున్న ఆటో డ్రైవర్ మున్నా

జడ్చర్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నగదు, విలువైన ఏటీఎం కార్డులు, ఇతర వస్తువులు ఉన్న బ్యాగును జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి సమక్షంలో బ్యాగు యజమానికి ఆటో డ్రైవర్ అప్పగించి నిజాయతీ చాటుకున్నారు. ఈ సంఘటన సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల లో చోటు చేసుకుంది. కర్నూలు పట్టణానికి చెందిన రాఘవేంద్ర అనే వ్యక్తి జడ్చర్లలో ఆ టోలో తన బ్యాగు మరిచిపోయి దిగిపోయా డు. వెంటనే తేరుకుని జడ్చర్ల పోలీస్‌స్టేష న్‌లో ఫిర్యాదు చేశాడు.

ఫిర్యాదు మేరకు వెంటనే ఆటో యూనియన్ సభ్యులకు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి సమాచారం అందించారు. ఆటోలో మరిచిన బ్యాగును ఆటో డ్రైవర్ మున్నా, యూనియన్ అధ్యక్షులు హజీతో కలిసి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సీఐ సమక్షంలో సంబంధిత యజమానికి అప్పగించారు. నిజాయతీని చాటుకున్న ఆటో డ్రైవర్‌ను సీఐ అభినందిచారు.

ఇద్దరు నిందితులకు రిమాండ్

గద్వాల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా మండల పరిధి లోని పూడూరు గ్రామంలో మూడు రోజుల క్రితం బోయ బీచుపల్లి ఇంట్లో దొంగతనం జరిగింది. దొంగతనానికి పాల్పడిన రాఘవేందర్ అనే నిందుతుడిని పట్టుకొని కోర్టులో హాజరు పర్చగా న్యాయస్థానం 14రోజుల రిమాండ్ విధించిందని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మరో కేసులో నాలుగు రోజుల క్రితం పూడూరు గ్రామం మీదుగా రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశామని, అందులో ప్రధాన నిందితుడు అయిన జంగయ్య అలియాస్ జనార్ధన్‌ను పట్టుకొని కోర్టులో హాజరు పర్చగా 14 రోజులు జుడిషియల్ రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై తెలిపారు.

సినిమా పాటల 'అల'

- 'ప్రతిక్షణం' సినిమాతో అలరాజు అరంగేట్రం
- క్రేజీ ఫెలో చిత్రానికి పాటలు రాసి ప్రశంసలు



ఏకాంతంగా కూర్చొని పాటలు రాస్తున్న అలరాజు

సినిమా ప్రపంచంలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకోవడమే ఆయన ధ్యేయం.. 'ప్రతిక్షణం' సినిమాతో పాటల రచయితగా అరంగేట్రం చేశారు. క్రేజీ ఫెలో సినిమాతో ప్రశంసలందుకున్నారు. దీంతో పలు చిత్రాలకు పాటలు రాసే అవకాశం లభించింది. నేను ఎంచుకున్న పనిని అంకిత భావంతో చేస్తానని అంటున్నారు. ఆయనే నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండల కేంద్రానికి చెందిన అలరాజు.. సినీ గేయ రచయితగా పేరు తెచ్చుకుంటున్న ఆయనతో 'ఆంధ్రజ్యోతి' ముచ్చటించింది. వివరాలు మీకోసం...

- అచ్చంపేట, ఆంధ్రజ్యోతి

పాటంటే ఆయనకు ప్రాణం.. రచననే వృత్తిగా స్వీకరించారు. నిరంతరం అక్షరాలే శ్వాసగా, పల్లవి, చరణాలే శ్వాసగా సినిమాలకు గేయాలు రాస్తూ గుర్తింపు తెచ్చుకుంటున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండల కేంద్రానికి చెందిన రైతు గోరేజి, సుగుణమ్మ దంపతులకు నలుగురు సంతానం ఉన్నారు. వారిలో మూడవ వాడు అలరాజు. ఆయనకు ఇద్దరు అక్కలు, ఒక్క అన్న ఉన్నారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకు పదరలోనే చదువుకున్నాడు. ఆ తర్వాత అమ్రాబాద్‌లో ఇంటర్, కొండనాగులలో డిగ్రీ, హైదరాబాద్‌లో ఎంఏ పూర్తి చేశారు. ఆయనకు చిన్నతనం నుంచే సినిమాలపై ఆసక్తి ఉంది. ఎలాగైనా సినిమా రంగంలో తనకంటూ గుర్తింపును తెచ్చుకోవాలనుకున్నాడు. అందుకు రచనా వ్యాసంగాన్ని వృత్తిగా ఎంచుకున్నారు. గేయ రచయితగా పలు సినిమాలకు పాటలు రాశారు. ఎన్నో ఒడిదుడుకుల మధ్య అవకాశాలు దక్కించుకుంటూ దర్శకులు, నిర్మాతల మన్ననలు పొందుతున్నారు.

'ప్రతిక్షణం'తో తొలి అడుగు

అలరాజుకు మొదటిసారిగా ప్రతిక్షణం అనే సినిమాలో అన్ని పాటలు రాసే అవకాశం లభించింది. ఆ తర్వాత మనక్కులి చిత్రానికి పాటలు రాశారు. ప్రముఖ నటుడు మంచు విష్ణు హీరోగా నటించిన 'తిప్పరా మీసం'తో పాటు, ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ సంగీత సారథ్యంలో వచ్చిన ప్రేమదేశం వంటి చిత్రాలకు ఆయన రాసిన పాటలు పలువురి ప్రశంసలు అందుకున్నాయి. ప్రముఖ సీనినటుడు సాయికుమార్ తనయుడు ఆది హీరోగా నటించిన క్రేజీఫెలో చిత్రానికి కూడా ఆయనే పాటలు రాశారు. వాటితో పాటు ఆయన



సినీ గాయకులు మంగ్లీ, రమ్యలతో అలరాజు

పాటలు రాసిన తంత్ర, లంబసింగి చిత్రాలు ఇటీవలే విడుదలయ్యాయి. తంత్ర సినిమాలోని ధీరే ధీరే అనే పాటకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభించింది. అంతే కాకుండా ప్రముఖ దర్శకుడు కె. విజయ భాస్కర్ ఆధ్వర్యంలో తీసిన ఉషా పరిణాయం సినిమాకు కూడా ఆయన పాటలు అందించారు.

ప్రశంసలందుకున్న 'తెలియదే.. తెలియదే'

'మైల్స్ ఆఫ్ లవ్' చిత్రం కోసం ఆయన రాసిన 'తెలియదే.. తెలియదే..' పాటను ప్రముఖ గాయకుడు సిద్ శ్రీరాం పాడారు. ఈ పాటను యూట్యూబ్‌లో దాదాపు ఐదు కోట్ల మంది వీక్షించారు. ఇదే సినిమాలో ఆర్ఆర్ ధ్రువణ్ సంగీత సారథ్యంలో వెలువడిన ఆయన రాసిన 'గగనమ్ము దాటి' పాటకు కూడా మంచి ఆదరణ లభించింది. వీటితో ఆయన పాటలు రాసిన మరికొన్ని సినిమాలు కూడా విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. నేను పుట్టిన నల్లమల ప్రాంతానికి గుర్తింపు తేవాలన్నదే తన లక్ష్యమని ఆయన అంటున్నారు.



అలరాజు రాసిన ఉషాపరిణయం చిత్ర అడియో రిలీజ్ ఫంక్షన్‌లో..

విజయ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలి

- రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఫిర్యాదు

జడ్చర్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మైన్స్ శాఖ జిల్లా ఏడీగా విధులు నిర్వహించి, జనగామ జిల్లా ఏడీగా బదిలీ అయిన విజయ్‌కుమార్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారికి జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఆ ప్రతులకు సంబం ధించి ప్రెస్‌నోట్‌ను సోమవారం జడ్చర్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేశారు. బాలానగర్ మండల కేంద్రంలోని సర్వే నెంబరు 118/పి భూమిలో వారాహి అనే ప్రైవేటు సంస్థకు భారీ స్థాయిలో మట్టిని తర లించిందని పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో ఉన్న పెద్దచెరువు కాల్వను పూడ్చివేసి, కాల్వ దిశను మళ్లించిందంటూ క్షేత్ర స్థాయిలో విలేకరుల సమావేశంలో ఫిబ్రవరి నెలలో ఎమ్మెల్యే వెల్లడించిన అంశాన్ని పత్రిక ప్రకటనలో వివరించారు. ఈ వ్యవహారంపై అప్పటి జిల్లా మైన్స్ ఏడీగా విధులు నిర్వహించిన విజయ్‌కుమార్ విచారణ చేపట్టి, అక్రమంగా మట్టి తరలింపునకు సంబంధించి ప్రభుత్వానికి రూ.ఐదు కోట్ల 12లక్షలు సీనరేజ్ చార్జీలు చెల్లించాలని నోటీసులు జారీ చేశారని తెలిపారు.

మహబూబ్‌నగర్ నుంచి జనగామకు బదిలీ అయిన సందర్భంలో బదిలీపై వెళ్లే ఒక్క రోజు ముందు.. వారాహి సంస్థకు రూ.5 కోట్ల 12లక్షల సీనరేజ్ చార్జీలు చెల్లించాల్సిన మొత్తాన్ని మాఫీ చేస్తూ తాను జారీ చేసిన నోటీసులను రద్దు చేశాడని వివరించారు. ఈ అక్రమాలపై లోతుగా దర్యాప్తు చేయాలంటూ ఉన్నత అధికారులను కోరడంతో నలుగురు ఉన్నత అధికారులతో జిల్లా కలెక్టర్ ఒక ఫోర్‌మెన్ కమిటీని నియమించిందన్నారు. మహబూబ్‌నగర్ ఆర్డీవో నవీన్, ఇరిగేషన్ ఈఈ ఉదయ్‌శంకర్, సర్వే లాండ్ రికార్డ్స్ ఏడీ కృష్ణారావు, మైన్స్ డీడీ నరసింహారెడ్డిల ఫోర్‌మెన్ కమిటీ విచారణ చేపట్టిందన్నారు. వారాహి సంస్థ లక్షా 67వేల టన్నుల మట్టిని ఇతర ప్రాంతాలలో తవ్వి తీసుకువచ్చినట్లుగా నిర్ధారించారని తెలిపారు. వారాహి సంస్థ అక్రమాలు నిరూపణ అయ్యాయని, వారాహి సంస్థకు పత్తాసు పలికి తాను బదిలీపై వెళ్లే ఒక్క రోజు ఆ సంస్థకు అనుకూలంగా ఉత్తర్వులను జారీ చేసిన మైన్స్ ఏడీ విజయ్‌కుమార్‌ను తక్షణం విధుల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గతంలో నిర్ణయించిన విధంగా వారాహి సంస్థతో రూ. ఐదు కోట్ల 12 లక్షలను రాబట్టాలని చీఫ్ సెక్రటరీని కోరినట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు.

ఆర్టీసీ రీజియన్‌కు 104 శాతం ఆక్యుపెన్సీ

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ఆర్టీసీ రీజియన్ 104 శాతం ఆక్యుపెన్సీ సాధించి రాష్ట్రంలోని 11 రీజియన్‌లలో ఈ నెల 1 నుంచి 11వ తేదీ వరకు మొదటి స్థానంలో నిలిచిందని ఆర్ఎం శ్రీదేవి తెలిపారు. అలాగే రీజియన్ పరిధిలోని పది డిపోలలో మూడు డిపోలు అత్యధిక ఈపికె, ఓఆర్ సాధించినందుకు ఆర్టీసీ ఎండీ, ఆర్.ఎం. ఆయా డిపోల డిపో మేనేజర్లను, ట్రాఫిక్ సూపర్‌వేజర్లను, ఇతర సిబ్బందిని ముఖ్యంగా డ్రైవర్, కండక్టర్లను ప్రత్యేకంగా అభినందించారు. మహబూబ్‌నగర్ రీజియన్‌లోని నాగర్‌కర్నూల్ 67.1 ఈపికె, 114.3 ఓఆర్, వనపర్తి డిపో 65.35 ఈపికె, 110.69 ఓఆర్ సాధించిందని, గద్వాల 63.67 ఈపికె, 108.62 ఓఆర్ సాధించిందని తెలిపారు. ఈ 11 రోజుల్లో రీజియన్ పరిధిలో 4.48 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో వారివారి ఊళ్లకు చేరుకున్నారని, వారందరి కొరకు తిరుగు ప్రయాణానికి ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా అన్ని బస్టాండ్లలో సౌకర్యాలు, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు 24 గంటలు ఉండేలా ప్రణాళిక రూపొందించి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

దసరా స్పెషల్ ఆపరేషన్స్ సందర్భంగా ఈ నెల 13 నుంచి 16 వరకు రిటర్న్ ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా ఉమ్మడి జిల్లాలోని పది డిపోల నుంచి అదనపు సర్వీసులు నడపనున్నట్లు తెలిపారు. 13 నుంచి 16 వరకు డిపోల వారిగా హైదరాబాద్‌కు నడిపే ప్రత్యేక బస్సు లు అచ్చంపేట 23, గద్వాల 22, కల్వకుర్తి 22, కొల్లాపూర్ 23, మహబూబ్‌నగర్ 30, నాగర్‌కర్నూల్ 20, నారాయణపేట 22, షాద్‌నగర్ 21, వనపర్తి 27 కలిపి 210 బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు అందరూ సహకరించాలి

- ఎఫ్ఆర్‌వో గురుప్రసాద్

దోమలపెంట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతీ ఇక్కరు బాధ్యతగా భావించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని దోమలపెంట ఎఫ్ఆర్‌వో గురుప్రసాద్ అన్నారు. సోమవారం శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న వటువర్లపల్లిలో హోటల్స్ దాబాలలో తనిఖీలు నిర్వంహించి వాటర్ బాటిల్స్, కూల్‌డ్రింక్స్, చిప్స్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్రాబాద్ అభయారణ్యం ప్రాంతంలో ప్లాస్టిక్ నిర్మూలనకు అటవీశాఖ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. జూలై ఒకటి నుంచి నిబంధనలు అమలు పర్చినా వ్యాపారులు పెడచెవిన పెడుతూ ప్లాస్టిక్ వాడకంతో ఉన్న తినుబండారాలను విక్రయిస్తున్నారన్నారు. గతంలో వ్యాపారులకు నోటీసులు ఇచ్చినా వారిలో మార్పు లేకపోవడంతో సోదాలు నిర్వహించి వివిధ రకాల ప్లాస్టిక్ వస్తువులు స్వాధీనం చేకున్నామన్నారు. ఇకముందు ఇలాగే కొనసాగితే జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు. ఎఫ్ఎస్‌వో ధర్మ, గోపాల్, ఎఫ్ఎస్‌వో భీముడు, కార్తీక్, వెంకటేష్, సుమలత సిబ్బంది ఉన్నారు.



వటువర్లపల్లిలో కూల్‌డ్రింక్స్‌ను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

సుంకేసుల డ్యాంకు పెరిగిన వరద

- 92 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో... 90 వేల క్యూసెక్కుల ఔట్ ఫ్లో

రాజోలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజోలి శివారులోని సుంకేసుల డ్యాంకు వరద ప్రవాహం పెరిగింది. ఎగువన కురుస్తున్న వర్షం కారణంగా సోమవారం డ్యాంకు 92,950 క్యూసెక్కుల వరద వస్తుండటంతో డ్యాం 22 గేట్లు ఎత్తి 90,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు డ్యాం జేఈ రాజు తెలిపారు. మరో రెండు రోజుల పాటు వరద పెరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. డ్యాం సామర్థ్యం 1.20 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.917 టీఎంసీ నీరు నిల్వ ఉందన్నారు. డ్యాం గరిష్ట నీటిమట్టం 292.00 మీటర్లు కాగా, ప్రస్తుతం 291.20 నీటిమట్టం నమోదు అయినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా జూరాల డ్యాంకు కూడా ఎగువ నుంచి కాస్త వరద పెరిగినట్లు అధికారులు తెలిపారు.



సుంకేసుల డ్యాం నుంచి విడుదల అవుతున్న నీరు

అంబులెన్స్‌కు ఆపదొచ్చింది

- నిమోనియా సోకిన చిన్నారిని తీసుకెళ్తుండగా పేలిన టైర్
- శ్వాస ఆడక చిన్నారి ఇక్కట్లు.. సమయానికి మరో అంబులెన్సు
- బోయపల్లి లో అర్ధరాత్రి ఘటన



అంబులెన్సులోనే ఉన్న చిన్నారి

నవాబ్‌పేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయంలో వైద్య సేవలందించే అంబులెన్సుకే ఆపదొచ్చింది. వైద్యం కోసం అర్ధరాత్రి ఆసుపత్రికెళ్తున్న ఓ చిన్నారికి గంట పాటు ఇబ్బందులు తప్పలేదు. వివరాల్లోకి వెళ్తే.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణ కేంద్రానికి చెందిన వెంకటేష్ అనే యువకుడు తన కుటుంబ సభ్యులతో కలిసి దసరా పండుగకు నవాబ్‌పేట మండలం యన్మనగండ్ల గ్రామంలో ఉన్న తన చెల్లెలు అనుషమ్మ ఇంటికి పిల్లాపాపలతో వచ్చారు. అందరూ కలిసి సంతోషంగా పండుగ జరుపుకున్న తర్వాత రాత్రి ఒంటి గంట ప్రాంతంలో వెంకటేష్ కుమారుడు సాత్విక్‌కు వాంతులు, విరేచనాలు కావడంతో ఆందోళన చెందారు. దీంతో నవాబ్‌పేట ప్రాథమిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి 108 సిబ్బందికి సమాచారం ఇచ్చి అంబులెన్సులో జిల్లా ఆసుపత్రికి వెళ్తుండగా.. మహబూబ్‌నగర్ మండలం బోయపల్లి సమీపంలోకి రాగానే అంబులెన్సు ముందు టైరు పేలిపోయింది. సుమారు గంటపాటు అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. అందులో ఉన్న చిన్నారి సాత్విక్ శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారడంతో బాలుడి తండ్రి వెంకటేష్ తన బంధువులు, స్నేహితుల సహకారంతో గంట తర్వాత మరో అంబులెన్సులో జిల్లా ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. ఇదిలా ఉంటే, గత మూడు నెలలుగా అంబులెన్సు మొరాయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని 108 సిబ్బంది రోగి కుటుంబ సభ్యులతో వాపోయినట్లు సమాచారం.



అచ్చంపేట మండలం పెనిమిల్ల గ్రామం నడిబొడ్డులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఆడారు.. పాడారు..

- పెనిమిల్లలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు
- పాల్గొన్న అచ్చంపేట సివిల్ న్యాయాధికారి విజయ్ కుమార్

అచ్చంపేట/కల్వకుర్తి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మండలం పెనిమిళ్ల గ్రామంలో సద్దుల బతుక మ్మ ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. తెలంగాణ వ్యాప్తంగా విజయదశమి నాటికి బతుకమ్మ సంబురాలు ముగిసినా ఉప్పునుంతల మండలం పెనిమిల్ల గ్రామంలో మాత్రం దసరా మరుసటి సద్దుల బతుకమ్మ ఉత్సవాలను జరుపు కోవడం ఆనవాయితీగా వస్తుంది. సద్దుల బతుకమ్మ ఉత్సవాలలో అచ్చంపేట సివిల్ న్యాయాధికారి విజయ్ కుమార్ పాల్గొనగా, అచ్చంపేట ఎమ్మెల్యే సతీమణి డాక్టర్ చిక్కుడు అనురాధ మహిళలతో కలిసి ఆడిపాడారు. సాయంత్రం మూడు గంటల నుంచి రాత్రి 7గంటల వరకు గ్రామం నడిబొడ్డులో పెద్ద ఎత్తున యువతులు, మహిళలు బతుకమ్మ ఉత్సవాలలో పాల్గొని ఆడిపాడారు. బతుకమ్మ సంబురాలను తిలకించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు చేరుకుని ఆనందం వ్యక్తపరిచారు. అనంతరం బ్యాండు మేళాలతో సమీపంలో ఉన్న దుందుభీ నదికి చేరుకుని అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గౌరమ్మ గంగానదిలో నిమజ్జనం చేశారు. ఈ బతుకమ్మ సంబురాలలో మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, మారం భూపాల్ రెడ్డి ట్రస్ట్ చైర్మన్ మారం సురేష్ రెడ్డి, యువకులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



బతుకమ్మతో కల్వకుర్తి పుర చైర్మన్ ఎడ్మ సత్యం దంపతులు

కల్వకుర్తిలో...

కల్వకుర్తి పట్టణంలో సద్దుల బతుకమ్మ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. కల్వకుర్తి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకలకు పట్టణంలోని మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వివిధ రకాల పూలతో తయారు చేసిన బతుకమ్మలను మహిళలు నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా పట్టణ సమీపంలోని కపిలేశ్వరస్వామి గుట్ట వద్దకు తరలివచ్చారు. బతుకమ్మలతో సందడి చేశారు. సద్దుల బతుకమ్మ వేడుకలకు నిర్వాహకులు విశాల వసతులు కల్పించారు. మునిసిపల్ వైస్ చైర్మన్ షాహీద్, మాజీ మునిసిపల్ చైర్మన్ రాచోటి శ్రీశైలం, మాజీ సర్పంచ్‌లు బృంగి ఆనంద్‌కుమార్, పసుల సుదర్శన్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, మహిళలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



పెనిమిల్ల గ్రామం నడిబొడ్డులో పేర్చిన బతుకమ్మలు



మేళ తాళాలతో బతుకమ్మలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



కల్వకుర్తిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

నడక మంచిదే



- మార్నింగ్ వాక్‌తో సంపూర్ణ ఆరోగ్యం
- ఏళ్ల తరబడి కొనసాగిస్తున్న సీనియర్ సిటిజన్లు
- శారీరక దృఢత్వంపై యువతీ, యువకుల శ్రద్ధ
- ఉదయపు నడక, వ్యాయామంపై ప్రత్యేక దృష్టి

ఉరుకులు పరుగుల జీవితాల్లో కొంత ప్రశాంతత, ఉపాధి, ఉద్యోగాల్లో అలసి సొలసి పోతున్న శరీరానికి హాయినిచ్చే చల్లగాలి... దైనందిన జీవితంలో ఒత్తిడికి గురవుతున్న మనసుకు కొంత సాంత్వన అవసరం.. అందుకు 'మార్నింగ్ వాక్' దివ్య ఔషధం అంటున్నారు యువతీ యువకులు.. వయసు పెరగడంతో వచ్చే అనారోగ్య సమస్యలను అధిగమించేందుకు 'ఉదయపు నడక'ను మించినది మరేదీ లేదంటున్నారు సీనియర్ సిటిజన్లు.. గద్వాల, నాగర్‌కర్నూల్ పట్టణాల్లో కొందరు మార్నింగ్ వాకర్స్‌ను 'ఆంధ్రజ్యోతి' పలుకరించింది. ఆ వివరాలతో 'ప్రత్యేక కథనం' మీ కోసం...

– గద్వాల టౌన్/ నాగర్‌కర్నూల్ టౌన్ (ఆంధ్రజ్యోతి)

30 ఏళ్లుగా ఉదయం నడక



వృత్తిరీత్యా వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహించిన నాకు మార్నింగ్ వాక్ వల్ల ఒనగూరే ప్రయోజనాలపై స్పష్టత ఉంది. మూడు దశాబ్దాల నుంచి ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా నడవటం అలవాటుగా మార్చుకున్నాను. ఇప్పటి వరకు మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడలేదు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు మార్నింగ్ వాక్‌తో గరిష్ఠంగా ఉపశమనం పొందే అవకాశం ఉంటుంది. దానికి తోడు డైట్ కంట్రోల్ పాటించాలి. నేను ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాను.

– మల్లికార్జున్, రిటైర్డ్ వైద్యాధికారి

దైనందిన జీవితంలో ఒత్తిడిని అధిగమించేందుకు, బీపీ, షుగర్‌ల బారిన పడకుండా ఉండేందుకు, ఇప్పటికే షుగర్ బారిన పడిన వారు, దానిని నియంత్రణలో ఉంచుకునేందుకు, మొత్తంగా ఆరోగ్య పరిరక్షణకు 'నడక మంచిదే' అంటున్నారు యువతీ యువకులు. మార్నింగ్ వాక్‌ను వారు దినచర్యలో భాగంగా మార్చుకుంటున్నారు. అలాగే సీనియర్ సిటిజన్లు ఉదయపు నడకను ఏళ్ల తరబడి నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు. ఇలా వయసుతో సంబంధం లేకుండా 20 ఏళ్ల యువకుడి నుంచి 80 ఏళ్ల వయోవృద్ధుల వరకు నడకను దినచర్యలో భాగంగా మార్చుకుంటున్నారు. కొందరు ఏళ్ల తరబడి మార్నింగ్ వాక్‌ను క్రమం తప్పకుండా కొనసాగిస్తున్నారు. మరి కొందరు మరికొందరు మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడి, వైద్యుల సూచన మేరకు మార్నింగ్ వాక్ చేస్తున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం, తేరు మైదానం, స్మృతి వనం, పట్టణ ప్రకృతి వనాల్లో ఏర్పాటు చేసిన వాకింక్ ట్రాక్‌లు ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్స్‌తో సందడిగా మారుతున్నాయి. అలాగే రాయచూరు, అయిజ, జూరాల డ్యాం, నదీ అగ్రహారం వైపు నడకను కొనసాగిస్తున్న వారి సంఖ్య కూడా పెరుగుతూనే ఉంది.



నాగర్‌కర్నూల్‌లోని జడ్పీ మైదానంలో కలిసి వ్యాయామం చేస్తున్న వాకింగ్ వండర్ సభ్యులు

నాగర్‌కర్నూల్‌లో 'వాకింగ్ వండర్'

ఆరోగ్యవంతమైన జీవనమే లక్ష్యంగా నాగర్‌కర్నూల్ పట్టణానికి చెందిన కొందరు 'వాకింగ్ వండర్' అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం నినాదంతో, జిల్లా పరిషత్ మైదానం కేంద్రంగా 2017లో ఏర్పాటైన ఈ అసోసియేషన్ ఆరోగ్యం, స్నేహం, సేవా భావాలకు గొప్ప ఉదాహరణగా నిలుస్తోంది. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం నడక కోసం మైదానానికి వచ్చే కొందరితో ప్రారంభమైన వాకింగ్ వండర్‌లో ప్రస్తుతం సభ్యుల సంఖ్య 70కి చేరింది. వారిలో ఉద్యోగులు, వ్యాపారులు, వివిధ వృత్తుల్లో స్థిరపడిన వారున్నారు. వారు ప్రతీ రోజు ఉదయం నడక, వ్యాయామంతో పాటు, మానసిక ఆరోగ్యం కోసం లాఫింగ్, ధ్యానం కొనసాగిస్తున్నారు. సభ్యుల పుట్టిన రోజు వేడుకలను మైదానంలోనే నిర్వహిస్తున్నారు. వీరంతా డ్రస్ కోడ్ కూడా పాటిస్తున్నారు. వారంలో ఐదు రోజులు బ్లూ టీ షర్టులు, శని, ఆది వారాల్లో మెరూన్ టీ షర్టులు ధరిస్తున్నారు.

సేవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు

వండర్ అసోసియేషన్ సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా ముందుంటోంది. సభ్యుల్లో ఎవరికి ఆరోగ్య సమస్య వచ్చినా ఆర్థిక సహాయం అందిస్తూ చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా మైదానంలో జాతీయ పతాకావిష్కరణ, ప్రముఖుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు. మొక్కలు నాటుతున్నారు. పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న ఉత్సవ కమిటీలకు విరాళం ఇస్తున్నారు.

పెట్టుబడి లేని టానిక్



ప్రతి రోజు నడకతో పాటు వ్యాయామం చేయడం పెట్టుబడి లేని టానిక్ లాంటిది. ఆరోగ్యమే అసలైన సంపద. తామంతా కలిసి నడుస్తూ మానసిక, శారీరక ఉల్లాసాన్ని పొందుతున్నాం.

– కొత్త శ్రీనివాసులు, కౌన్సిలర్



గద్వాల పట్టణంలో వాకింగ్ చేస్తున్న సీనియర్ సిటిజన్లు

25 ఏళ్లగా నడక అలవాటు



గద్వాలకు 30 ఏళ్ల క్రితం వచ్చి స్థిరపడ్డాము. 1999 నుంచి మార్నింగ్ వాక్ కొనసాగిస్తున్నాను. 12 ఏళ్ల క్రితం గుండెకు శస్త్రచికిత్స జరిగింది. కొన్నాళ్ల విశ్రాంతి అనంతరం, వైద్యుల సలహా మేరకు యథావిధిగా మార్నింగ్ వాక్ చేస్తున్నాను. ప్రతీ ఒక్కరు మార్నింగ్ వాక్‌ను అలవాటు చేసుకోవాలి.

– బలిగెర నారాయణ రెడ్డి, గద్వాల

నడకతో ఆరోగ్య పరిరక్షణ



నడకతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడంతో పాటు, సమాజంలో స్నేహం, సేవా భావాలను పెంపొందించేందుకు వాకింగ్ వండర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నాం. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నాం. అలాగే సేవా కార్యక్రమాలను మరింత విస్తరిస్తాం.

– పడిగె తిరుపతయ్య, వాకింగ్ వండర్ అధ్యక్షుడు

ఐక్యతను చాటేందుకు డ్రస్ కోడ్



అసోసియేషన్ సభ్యుల్లో సోదర భావం, ఐక్యతను చాటుకునేందుకు డ్రస్‌కోడ్ ఏర్పాటు చేసుకున్నాం. అందుకు నా వంతుగా సభ్యులందరికీ కోడ్‌కు అనుగుణంగా టీ షర్టులు అందించాను. ఎన్ని పనులున్నా ఉదయం మాత్రం సభ్యులతో కలిసి నడకను కొనసాగిస్తున్నా.

– పాలమూరు యాదయ్య, సభ్యుడు

హే..కేశవా మన్నించు



సర్వే నెంబరు 295లోని కేశవస్వామి ఆలయ భూమి

(మొదటి పేజీ తరువాయి)

పాల్పడ్డారు. ఇనాందారులు తప్పుడు ధ్రువ పత్రాలు సృష్టించి, అధికారులకు ఆమ్యామ్యాలిచ్చి.. రికార్డుల్లో పేర్లు నమోదు చేయించుకుని తమ పేర్ల నుంచి ఇతరులకు విక్రయించారు. వీటిలో కొన్ని ధరణి పోర్టల్‌లో కూడా నమోదు కాగా, మరికొన్ని దేవుడిపేరుపైనే కనిపిస్తున్నాయి. ఇలాంటి భూములకు ఆర్డీవో కార్యాలయం నుంచి పుట్టగొడుగుల్లా ఓఆర్‌సీలు పుట్టుకొస్తున్నాయి.

ఊరి పెద్దలే రాబందులు

ఆలయాల భూముల పాలిట ఊరి పెద్దలే రాబందులుగా మారారు. ఉన్నవి సరిపోవని దేవుడి ఆస్తులపై పడ్డారు. అనుభవదారులను నయానోభయానో మచ్చిక చేసుకొని, రికార్డుల్లో ఉన్న సర్వే నెంబర్లకు బైలు సృష్టించి, తమ పేర్లపై బదలాయించుకున్నారు. యక్తపూరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన భార్య పేర ఇలాగే బైలు సృష్టించి, అనుభవదారుడి వద్ద కొనుగోలు చేశాడు. దీనినే మరొక ఊరిపెద్ద కారుచౌకగా కొనుగోలు చేసి, ప్రస్తుతం ఓఆర్‌సీ పొంది అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది.

● బోరవెల్లి గ్రామ శివారులోని సర్వే నెంబరు 294లో రెండెకరాలు, 295లో మూడెకరాలకు మొత్తం ఐదు ఎకరాలకు 8-8-2024న ఆర్డీవో కార్యాలయం నుంచి చట్టంలో ఉన్న లొసుగులను ఆధారంగా చేసుకుని ఓఆర్‌సీ జారీ చేశారు. ఈ ఐదు ఎకరాలను కొనుగోలు చేసిన ఓ గ్రామ పెద్ద వోఆర్‌సీని పట్టుకుని రిజిస్ట్రేషన్ కోసం స్థానిక రెవెన్యూ అధికారిపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. అనుభవదారులేమో ఇలా దేవుడి భుములను తెగనమ్ముతుంటే, అక్కడి అర్చకులేమో అర్ధాకలితో తరతరాలుగా నిత్యం కైంకర్యాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆలయాలకు భూములు ఉండటంతో దూపదీప నైవేద్య పథకానికి నోచుకోలేకపోయమని ఆలయ అర్చకుడు రవీంద్రనాథ్ ఆచార్యులు ఆవేదనతో తెలిపారు. ఎండోమెంట్ అధికారుల ఉదాసీనత వల్ల బోరవెల్లి కేశవస్వామి ఆలయ భూములు వేరే వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయి. అనుభవదారుల నుంచి వీరు కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లుగా తెలుస్తోంది. సర్వే నెంబరు 270లో కేశవస్వామి ఆలయానికి 10 ఎకరాలా ఐదు గుంటల భూమి ఉండగా 270/ఏ, 270/బీ సృష్టించి రెండెకరాల భూమిని అనుభవదారులైన కిల్లెదారి రాధాకృష్ణ, కిల్లెదారి క్రిష్టయ్య అదే గ్రామానికి చెందిన మొహ్మద్‌హుస్సేన్ భార్య రిజ్వానబీ పేరిట 19-07-2017న గద్వాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేశారు. ధరణి పోర్టల్‌లో మాత్రం దేవుడి పేరే కనిపిస్తున్నా.. సదరు దేవుడి భూమి మాత్రం మతేతర వ్యక్తుల చేతుల్లో ఉండటం చర్చనీయంశంగా మారింది. ఇదే సర్వే నంబర్‌లోని మరో రెండెకరాల భూమిని అదే రోజున అదే గ్రామానికి చెందిన మరొక వ్యక్తి తన భార్య షామీమ్‌బీ పేరిట రిజిస్టర్ చేసుకుని సాగు చేస్తున్నట్లు తెలిసింది.

లేఖ రాసి, ఆర్‌వో ఇచ్చి ఉంటాం

ఖిద్మతి ఇనాం భూములకు వోఆర్‌సీలు ఇవ్వరు. ఒకవేళ ఆ భూములకు ఓఆర్‌సీలు కావాలని ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే దాని ప్రతితో ఎండోమెంట్ వారికి లేఖ రాస్తాం. వారు అనుమతి ఇస్తేనే ఓఆర్సీలు జారీ చేస్తాం. బోరవెల్లిలోని చెన్నకేశవ స్వామి భూముల విషయంలో కూడా ఇలాగే లేఖలు రాసి, ఓఆర్‌సీలు ఇచ్చి ఉంటాం.

– ఆర్డీవో రామ్‌చందర్

ఆర్డీవో కార్యాలయం నుంచి లేఖ రాలేదు

సదరు భూములపై ఆర్డీవో కార్యాలయం నుంచి మాకు ఎలాంటి లేఖ రాలేదు. ఖిద్మతి ఇనాం భూములకు ఎన్‌వోసీ మేం ఎలా ఇస్తాం. ఇదంతా రెవెన్యూ అధికారులు చేస్తున్న తతంగం. రెవెన్యూ అధికారులు వోఆర్‌సీలు ఇష్టారీతిన జారీ చేయడం, మేము ఇదేంటని అడిగితే కోర్టుకు వెళ్లాలని సూచించడం వారికి పరిపాటిగా మారింది.

– వెంకటేశ్వరి, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్

సంఘటితంతోనే దేశ రక్షణ

- పేటలో ఆర్‌ఎస్‌ఎస్ భారీ కవాతు
- హారతులతో స్వాగతం పలికిన మహిళలు
- దారి పొడవునా పూలవర్షం కురిపించిన ప్రజలు



కవాతు నిర్వహిస్తున్న స్వయం సేవకులపై పుష్ప వర్షం కురిపిస్తున్న మహిళలు

నారాయణపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : హిందువుల సంఘటితంతోనే బారత దేశా నికి రక్షణ అని ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్ జీ అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం శత వసంతాల వేడుకలను సోమవారం నారాయ ణపేట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. వందలాది మంది ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పళ్ల హనుమాన్ మందిరం నుంచి పూర్తి గణవేషతో కవాతు ప్రారంభించారు. శివాజీ నగర్, సరాఫ్ బజార్, సెంటర్ చౌక్, మెయిన్ రోడ్, వీరసావర్కర్ చౌరస్తా, సత్యానారాయణ చౌరస్తా మీదుగా కవాతు శ్రీఫంక్షన్ హాల్‌కు చేరుకున్నది. దారి పొడవునా మహిళలు వారికి హరతులు పట్టి, పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీఫంక్షన్ హాల్‌లో డాక్టర్ మల్లికార్జున్ అధ్యక్ష తన జరిగిన సభలో ప్రాంత ప్రచారక్ లింగం శ్రీదర్‌జీ ప్రసంగించారు. దేశ రక్షణ ప్రజల చేతిలోనే ఉందన్నారు. ఇరుగు పొరుగు దేశా ల్లో హిందువులకు రక్షణ లేక అల్లాడుతున్నారని తెలిపారు. ఇటీవల బంగ్లాదేశ్‌లో ఆలయాలపై, హిందువులపై జరిగిన దాడులే ఇందుకు నిదర్శనమన్నారు. భారతదేశం అన్ని రంగాలో అభివృద్ధి చెందుతుండటం కొన్ని దేశాలకు, కొన్ని శక్తలకు కంటగింపుగా మారిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగురావు నామాజీ, నందు నామాజీ, డాక్టర్లు మదన్‌మోహన్ రెడ్డి, రాంబాబు, ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖ్‌లు పాల్గొన్నారు.

విశ్వగురు స్థానంలో నిలపడమే లక్ష్యం

ఊట్కూర్ : దేశాన్ని విశ్వగురు స్థానం నిలపడమే లక్ష్యంగా ఆర్‌ఎస్‌ఎస్ పని చేస్తోందని పాలమూర్ విభాగ్ ప్రచారక్ దేవేందర్‌జీ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శత వసంతాల సంబురాలను సోమవారం ఊట్కూర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ యువతలో జాతీయత, నైతిక విలువలను పెంపొందిస్తున్నట్లు తెలిపారు. స్వామి అదిత్య పర్మాశ్రీ మాట్లాడుతూ నైతిక విలువల పెంపునకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో నీలి రాంరెడ్డి, మ్యాడం లక్షణ్, మాజీ సర్పంచ్ భాస్కర్, హనుమంతు, వెంకటయ్య పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఖిల్లాఘణపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఖిల్లాగణపురం మండలంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ సురేశ్‌గౌడ్ తెలిపారు. సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ నందకిషోర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్‌కు చెందిన పుల్లారి రాజు, వెంకటేష్ అనే వ్యక్తులు మహబూబ్ నగర్ వీరన్న పేట ప్రాంతానికి చెందిన రేషన్ డీలర్ చంద్రశేఖర్‌కు సంబంధించిన 15 క్వింటాళ్ల (30 బస్తాలు)తో పాటు, వినియోగదారుల నుంచి సేకరించిన నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యా న్ని సేకరించారు. ఆ బియ్యాన్ని సోమవారం తెల్లవారుజామున మారుతీ వ్యాన్‌లో ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని దివ్య నవ్య రైస్ మిల్‌కు తరలిస్తుండగా, వనపర్తి సీసీఎస్ (సెంట్రల్ క్రైమ్ స్టేషన్) పోలీసులు పట్టుకున్నారు. బియ్యాన్ని తరలిస్తున్న వారితో పాటు, రైస్‌మిల్లు యజమాని పాలవాది లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

లక్కీడ్రా పేరుతో భారీ మోసం

- బాధితుల ఫిర్యాదు మేరకు కేసు

చిన్నంబావి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : లక్కీ డ్రా పేరుతో లక్షల రూపాయలు వసూలు చేసిన నిర్వాహకులు చివరకు చేతులెత్తేసి పరారయ్యారు. సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా చిన్నంబావి మండల కేంద్రంలో తిరుమలై ఎంటర్‌ప్రైజెస్ పేరుతో చిన్నంబావి మండల కేంద్రంలో 2022లో కొందరు లక్కీడ్రా స్కీమ్ ఏర్పాటు చేశారు. అందులో ఐదుగురు సభ్యులున్నారు. మరో 16 మందిని ఏజెంట్లుగా చేర్చారు. విస్తృతంగా ప్రచారం చేసి వేలాది మందితో స్కీం కట్టించారు. ప్రతీనెల 2,800 నుంచి మూడువేల మంది పేర్లతో లక్కీడ్రా తీసి, 10 మందికి బహుమతులను అందించేవారు. స్కీం కాలపరిమితి అయిపోయిన తర్వాత బహుమతులు రాని వారికి కూడా వారు చెల్లించిన మొత్తానికి సరిపోయే గిఫ్ట్ అందిస్తామని నిర్వాహకులు చెప్పారు. ఈ క్రమంలో 2024, జనవరి నాటికి లక్కీడ్రా స్కీమ్ కాలపరిమితి ముగిసింది. కానీ బహుమతులు రాకుండా మిగిలిన పోయిన వారికి ఎలాంటి డబ్బులు ఇవ్వకుండా చేతులెత్తేశారు. స్కీం భాగస్తులు ఒక్కొక్కరుగా జారుకోగా ఒక్కరు మాత్రమే మిగిలిపోయాడు. దీంతో అతడిపై ఒత్తిడి పెరగడంతో ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన గ్రామ పెద్దలు అతడితో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో 35 మందిని స్కీమ్‌లో సభ్యులుగా చేర్పించిన ఒక ఏజెంట్ రూ. 5.60 లక్షలు చెల్లించి మోసపోయానంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు చిన్నంబావి ఎస్‌ఐ పబ్బతి రమేశ్ తెలిపారు.



స్కీంకు సంబంధించిన కరపత్రం

పకడ్బందీగా పథకాల అమలు

(మొదటి పేజీ తరువాయి)

కింద నెలకు రూ.300 చెల్లిస్తే 60 సంవత్సరాల తరువాత నెలకు రూ.5 వేలు పెన్షన్ వస్తుందని తెలిపారు. ఇంత ముఖ్యమైన బీమా పథకాలను ప్రజలకు చేరవేయడంలో బ్యాంకులు పూర్తిగా నిర్లక్ష్యం వహించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కో బ్యాంకు ఒక్కరూ, ఇద్దరు రెండంకెల సంఖ్యలో బీమా చేయించారని వాటి రెన్యువల్ వచ్చే సరికి జీరో అయిందని అన్నారు. ఇంత నిర్లక్ష్యం ఏమిటని బ్యాంకర్లను ప్రశ్నించారు. ముద్ర రుణాలు, టర్మ్ లోన్, ప్రయారిటీ సెక్టార్, నాన్ ప్రయారిటీ సెక్టార్ వారీగా ఇవ్వాల్సిన రుణాలు సైతం నిర్దేశించిన లక్ష్యాలు సాధించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట రుణాలు సైతం బ్యాంకర్లు లక్ష్యం మేరకు రైతులకు ఇవ్వడం లేదని అసహనం వ్యక్తం చేశారు. వచ్చే దిశ సమావేశం నాటికి ప్రజలకు అవగాహన కల్పించి లక్ష్యాలు సాధించాలని ఆదేశించారు. ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా యువతకు, మహిళలకు స్వయం ఉపాధికి 80 శాతం సబ్సిడీతో 2021-22 లో మంజూరైన రుణాలు ఇప్పటి వరకు గ్రౌండింగ్ కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 80 శాతం డబ్బులు ప్రభుత్వం ద్వారా మంజూరై బ్యాంకుల్లో డబ్బులు మూలుగుతున్నా బ్యాంకులు ఇవ్వాల్సిన 20 శాతం ఇవ్వకుండా తాత్సారం చేయడం ఏంటని ప్రశ్నించారు. వారం రోజుల్లో సబ్సిడీ రుణాలు గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. కొంతమంది బ్యాంకు మేనేజర్లు సమావేశానికి గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరుపై కలెక్టర్‌కు సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పథకాలను అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పని చేసి పకడ్బందీగా అమలు చేస్తే ప్రజలకు ఫలాలు అందుతాయని సూచించారు. వనపర్తి జిల్లాలోని ప్రస్తుతం ఉన్న అన్ని గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరం మేరకు ఎంపీ నిధులు మంజూరు చేసి మరుగుదొడ్ల నిర్మాణాలు, మరమ్మతులు పూర్తి చేయిస్తామని సూచించారు.



సమావేశానికి హాజరైన అధికారులు

అనంతరం విద్య, వైద్యం, గ్రామీణ అభివృద్ధి శాఖ, మిషన్ భగీ రథ, పౌరసరఫరాల శాఖ పంచాయతీ రాజ్, విద్యుత్ శాఖపై సమీక్ష నిర్వహించారు. అన్ని గురుకుల పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల ఖాళీ లను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతం పెంచాలని దిశ సభ్యులకు బాధ్యతలు అప్పగించారు. వనపర్తి జిల్లా నుంచి మిల్లర్లు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండి యాకు ఇవ్వాల్సిన బియ్యంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బియ్యం ఇవ్వని మిల్లర్ల నుంచి డబ్బులు వసూలు చేయాలని సూచిం చారు. విద్యుత్ శాఖపై సమీక్ష నిర్వహిస్తు జిల్లాలో ఇళ్లపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలు తొలగింపు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ సబ్ స్టేషన్‌లో అవసరంపై పూర్తి నివేదికను ఇవ్వాలని విద్యుత్ శాఖ ఎస్‌ఈని ఆదేశించారు. బీఎస్‌ఎన్‌ఎల్ శాఖ సమీక్ష సందర్భంగా జిల్లాలో సెల్‌ఫోన్ సిగ్నల్‌కు సమస్య రాకుండా కొత్త సెల్ టవర్లకు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. అక్టోబరు 22న నాగర్ కర్నూల్ జిల్లాలో నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ ఒక రోజు వర్క్‌షాప్ ఉంటుందని, వనపర్తి జిల్లా సంబంధిత అధికారులు సైతం పాల్గొని వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని సూచించారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ... సంక్షేమ శాఖల ద్వారా సబ్సిడీ రుణాల గ్రౌండింగ్‌పై నివేదిక ఇవ్వాలని, అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో స్థానిక శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి, దేవరకద్ర శాసన సభ్యుడు జి.మధుసూదన్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, మైనార్టీ బోర్డు చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ , అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, దిశ కమిటీ సభ్యులు వీరయ్య, గంధం అంజనేయులు, చిన్నమ్మ థామస్, వెంకటేష్, శంకర్ నాయక్, ధనలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ ఉమాదేవి, జిల్లా అధికారులు, లీడ్ బ్యాంకు మేనేజర్ కౌశల్ కిషోర్ పాండే, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలు

భరించలేక వ్యక్తి ఆత్మహత్య

చిన్నంబావి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలు భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని పెద్దమారూర్ గ్రామానికి చెందిన అల్లూరి చంద్రారెడ్డి (55)కి ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్ద కుమార్తెకు వివాహ మైంది, ఆమె హైదరాబాద్‌లో ఉంటున్నారు. చిన్న కుమార్తెలో అమెరికాలో ఉంటోం ది. ఆయన భార్య గతంలోనే మృతి చెందింది. దీంతో గ్రామంలో ఒంటరిగా నివసిస్తున్న ఆయన సోమవారం తెల్లవారు జామున ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మనస్తాపంతో మహిళ..

కోస్గి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : చిన్న గొడవతో మనస్తాపం చెందిన ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నది. నారాయణపేట జిల్లా గుండుమల్ మండలం భక్తిమల గ్రామంలో సోమవారం ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన వెంకటమ్మ (45) కొంత కాలంగా హైదరాబాద్‌లో ఉంటూ పని చేసుకొని జీవిస్తోంది. ఇటీవల పండుగకు స్వగ్రా మానికి వచ్చింది. కాగా కుటుంబంలో చిన్న గొడవతో మనస్తాపం చెందిన ఆమె ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఈ విషయంపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

బిజినేపల్లి, అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు కేఎల్‌ఐ కాలువలో పడి గల్లంతైన ఓ వ్యక్తి మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని నంది వడ్డెమాన్ గ్రామానికి చెందిన ఈర్ల రాములు(35) సోమవారం బైక్‌పై గౌరారం గ్రామానికి వెళ్తూ, మంగనూర్ సమీపంలోని కేఎల్‌ఐ కాలువలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. గమనించిన స్థానికులు గాలించినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నాగశేఖర్ రెడ్డి సోమవారం ఉదయం రెస్క్యూ టీంను రప్పించి కాలువలో గాలించగా మృతదేహం లభ్యమైంది. అతడి భార్య ఈర్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.

ఇద్దరు పిల్లలు సహా తల్లి అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు పిల్లలు సహా తల్లి అదృశ్యమయ్యింది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన సరిత భర్త కృష్ణ ఇటీవల పక్షవాతానికి గురయ్యాడు. అతడికి తోడుగా ఉండాల్సిన సరిత తల్లిగారింటికి వచ్చింది. దీంతో తండ్రి బంగారయ్య ఆమెను మందలించాడు. దీంతో ఆమె ఈ నెల 10న ఇద్దరు పిల్లలు వైష్ణవి(7), భువనేశ్వర్ (5)లను తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయింది.

ఇంటర్వ్యూ..



మధ్యవర్తిత్వాన్ని సమర్థించే ప్రసక్తే లేదు

- తాడూరు తహసీల్దార్ కిరణ్మయి

తాడూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలు ఉన్న వారు మధ్యవర్తులతో కాకుండా నేరుగా తనను సంప్రదించి దరఖాస్తు చేసుకుంటే విచారించి పరిష్కరిస్తానని, మధ్యవర్తిత్వాన్ని ఎంత వరకైనా సమర్థించే ప్రసక్తే లేదని తాడూరు తహసీల్దార్ కిరణ్మయి తెలిపారు. బాధ్యతలు తీసుకుని 19 రోజుల వ్యవధిలోనే కార్యాలయంలో మార్పులు చోటు చేసుకున్నాయి. విధులపై ఎవరూ అలసత్వం వహించినా చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా సరే మధ్యవర్తులను నమ్మిమోసపోవద్దని సూచిస్తున్నారు. తహసీల్దార్‌తో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూ-

తహసీల్దార్‌గా బాధ్యతలు ఎప్పుడు తీసుకున్నారు?

తాడూరు మండల తహసీల్దార్‌గా ఈనెల 12న బాధ్యతలు తీసుకున్నా. అచ్చంపేట డివిజన్ పరిధిలోని వంగూరు మండలం నుంచి బదిలీపై వచ్చాను.

ఎలాంటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారు?

ప్రస్తుతం మండలంలో ఎన్నికలకు సంబంధించిన కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఓటరు జాబితాలు సరిచేసుకోవడం, పోలింగ్‌బూత్‌ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాం. సమస్యలు కలిగిన బాధితులు ఎలాంటి తడబాటు లేకుండా మా దృష్టికి తీసుకురావచ్చు. ఇందులో ఎవరీ మధ్యవర్తిత్వం అవసరం లేదు.

బీఎల్‌వోల పనితీరుపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఇటీవల ఎన్నికలకు సంబంధించి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశాం. బీఎల్‌వోల పనితీరు సక్రమంగా లేదని వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ నిబంధనల మేరకు విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం. నిర్లక్ష్యం వహించిన వారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయి.

ధరణి సమస్యలపై స్పందన?

ప్రస్తుతం ధరణిలో కొన్ని ఆప్షన్లు మాత్రమే ఉన్నాయి. అందుబాటులో ఉన్నంత వరకు ఆన్‌లైన్ ద్వారా వచ్చిన సమస్యలను క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరిస్తున్నాం. ఎక్కడైనా సరే సమస్యలు నిజమై ఉండి పరిష్కారం కానట్లయితే మా దృష్టికి తీసుకురావొచ్చు.

కార్యాలయ సిబ్బంది పనితీరు ఎలా ఉంది?

తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది పూర్తి సహాయ సహకారాలు ఉన్నాయి. సిబ్బంది, అధికారులు ప్రతి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటాం.

క్రైం కార్నర్

వివాహిత ఆత్మహత్య

బిజినేపల్లి, అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి): అత్తింటివారి వేధింపులతో మనస్తాపం చెందిన వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని సల్కేర్‌పేట చెందిన ముద్దని తిరుపతయ్య, శిరీష (22) భార్య భర్తలు. కొంత కాలంగా ఆమెను భర్తతో పాటు అత్తింటి వారు వేధింపులకు గురి చేస్తున్నారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె సోమవారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన తిరుపతయ్య ఆమెను నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందింది. ఆమె తండ్రి అంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగశేఖర్ రెడ్డి తెలిపారు. శిరీషకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్.. వ్యక్తికి తీవ్ర గాయాలు

తిమ్మాజిపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మకొండ శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గొరిటకు చెందిన ఏర్పుల ఎల్లస్వామి తన బైకుపై బిజినేపల్లి వెళ్లి పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా గుర్తు తెలియని ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఎల్లస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులకు సమాచారం అందుకుని వారు జడ్చర్ల ఆసుపత్రికి తరలించారు. తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలు శిక్ష

కల్వకుర్తిటౌన్, అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు సోమవారం ఎస్‌ఐ మాధవ రెడ్డి తెలిపారు. మిడ్జిల్ మండలానికి చెందిన మల్లేష్‌నాయక్ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడినట్లు తెలిపారు. ఆయనను కల్వకుర్తి కోర్టులో హాజరు పరచగా, శిక్ష విధించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

'ఎంజీకేఎల్‌ఐ'తో పెరిగిన వరిసాగు

- నిండిన చెరువులు, కుంటలు
- కరువు కాటకాలకు దూరం
- ఆనందోత్సవాల్లో రైతులు



దేవునితిర్మలాపూర్ శివారులో వరి సాగు

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఎంజీకేఎల్‌ఐ నీటి రాకతో మండలంలో మెట్ట పంటల సాగు కన్న వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఎన్నో ఏళ్ల కరువు కాటకాలతో అల్లాడగా, ఎంజీకేఎల్‌ఐ నీరు రాక ఊరటనిచ్చిందని రైతులు అభిప్రాయపడుతున్నారు. పెద్దకొత్తపల్లి, దేవుని తిర్మలాపూర్, వెన్నచెర్ల, నక్కలపల్లి, చంద్రకల్, సాతాపూర్, జొన్నలబొగుడ, కల్వకోల్, నారాయణపల్లి, గంట్రావుపల్లి, చెన్నపురాంపల్లి గ్రామాల్లో చెరువులు, కుంటలు నీటితో నిండి కళకళలాడుతున్నాయి. అలాగే ఎంజీకేఎల్‌ఐ కాల్వల ద్వారా నీరు ప్రవహిస్తుండడంతో ఆయకట్టు భూములు వరి సాగులో సిరులు కురిపిస్తున్నాయి. ఎక్కడ చూసినా పచ్చని వరి పైరులే దర్శనమిస్తున్నాయి.

సాగులోకి పొలాలు

మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 11,387 ఎకరాల్లో వరి, 5,347 ఎకరాల్లో మొక్కజొన్న, 1,173 ఎకరాల్లో పత్తి, 235 ఎకరాల్లో కందులు, 48 ఎకరాల్లో జొన్న పంటలను సాగు చేశారు. రబీలో వరి పంటతోపాటు వేరుశనగ, మినుముల పంట సాగు భారీగా చేసే అవకాశాలున్నాయి.

పెరిగిన విద్యుత్ వినియోగం

మండలంలో వ్యవసాయ రంగానికి విద్యుత్ వినియోగం బాగా పెరిగింది. గతంలో బోర్లు, బావులు ఉన్న రైతులు మాత్రమే విద్యుత్‌ను వినియోగించేవారు. ఎంజీకేఎల్‌ఐ నీటి రాకతో సాగు విస్తీర్ణం పెరగడంతో రైతులు కాల్వల్లో మోటార్లు అమర్చుతున్నారు. గతంలో కంటే రెండు రెట్ల విద్యుత్ వినియోగం పెరిగినట్లు అధికారులు అంచనా వేశారు. విద్యుత్ వాడుకునే రైతులు అనుమతులు తీసుకోవాలని సూచిస్తున్నారు.

మా తలరాతలు మారాయి



ఎంజీకేఎల్‌ఐ నీటి రాకతో మా తలరాతలు మారాయి. వ్యవసాయ భూమి ఉన్నా నీళ్ల లేక గతంలో వ్యవసాయం చేయలేకపోయాం. పొలాలను బీళ్లుగా ఉంచే వాళ్లం. ప్రస్తుతం కాల్వల ద్వారా నీరు రావడంతో పంటలు పండించుకునేందుకు అవకాశం దొరికింది.

- దేవేందర్‌గౌడ్, రైతు, దేవునితిర్మలాపూర్

వరి సాగు పెరిగింది



ఎంజీకేఎల్‌ఐ ప్రాజెక్టు ద్వారా నీరు రావడంతో వరి సాగు అధికంగా పెరిగింది. రైతులు ఉత్సాహంగా పంటలు సాగు చేసుకుంటున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఇతర పంటల కన్న వరి బాగా పెరిగింది. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి.

- శిరీష, మండల వ్యవసాయ అధికారి, పెద్దకొత్తపల్లి

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ సీతారామారావు
- ప్రజావాణికి 43 వినతులు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సీతారామారావు

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కె.సీతారామారావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. మొత్తం 43 వినతులు అందాయి. వీటిలో ధరణికి సంబంధించి 20, రెవెన్యూశాఖకు 13, వ్యవసాయ శాఖకు మూడు, విద్యాశాఖకు రెండు వచ్చాయి. మిగతా ఫిర్యాదుల్లో ఏడీఎస్‌ఎల్‌ఆర్, ఎలక్ట్రిసిటీ, ఎల్‌డీఎం, డీడబ్ల్యూవో, ఐటీడీఏ శాఖలకు సంబంధించి ఒక్కో ఫిర్యాదు అందింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా స్థాయి సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించడంతో పాటు క్షేత్రస్థాయి సమస్యలను సంబంధిత మండలాలకు బదిలీ చేసి పరిష్కరం అయ్యే వరకు పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ప్రజావాణికి 14 ఫిర్యాదులు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని పోలీస్ సముదాయం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ ప్రజావాణికి 14 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. న్యాయం గురించి మూడు, భూమి పంచాయితీకి 10, భార్యాభర్తల సమస్య గురించి ఒక ఫిర్యాదు అందింది. ఫిర్యాదుదారులతో స్వయంగా ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు.

విద్యుత్‌శాఖ డీఈని సస్పెండ్ చేయాలి

- బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్
- విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదుట నాయకుల ధర్నా



విద్యుత్‌శాఖ డీఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బీఎస్పీ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కరెంట్ బిల్లు విషయంలో మహిళను అవమానకరంగా మాట్లాడిన నాగర్‌కర్నూల్ విద్యుత్‌శాఖ డీఈ గోపాల్‌రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్ డిమాండ్ చేశారు. సోమవారం బీఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నాగర్‌కర్నూల్ అసెంబ్లీ అధ్యక్షుడు కొత్తపల్లి కుమార్ మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ మండలంలోని చందుబట్లలో కిష్టమ్మను డీఈ దూషించారన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా ఆంధ్రాకు చెందిన డీఈ పెత్తనం ఇక్కడ ఏంటని ప్రశ్నించారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి డీఈని సస్పెండ్ చేసి మరోమారు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పృథ్వీ రాజ్, కల్యాణ్, నాగేష్, బాలనాగులు, రాజు, శేషు, శ్రీకాంత్, విష్ణు, నాగరాజు, సాయిబాబు, రామకృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తాం

కొల్లాపూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేస్తామని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్ పేర్కొన్నారు. సోమవారం కొల్లాపూర్ పట్టణంలోని మాధవస్వామి ఆలయ ఆవరణలో నియోజకవర్గ బీఎస్పీ నాయకుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలను అమలు పరిచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. కార్యక్రమంలో సుధాకర్, వెంకటేష్, ఏసోఫ్, సరస్వతి, బాలకృష్ణుడు, బొల్లి కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహబూబ్ సుభాని గంధోత్సవం



కొల్లాపూర్‌లో మహబూబ్ సుభాని గంధోత్సవ ఊరేగింపు

కొల్లాపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మహబూబ్ సుభాని దర్గా గంధోత్సవం జామే మసీదు నుంచి బయలుదేరి పట్టణ పురవీధుల గుండా తిరుగూ మహబూబ్ దర్గాకు చేరుకుంది. వారం రోజులుగా గ్యార్వీ ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని మసీదులో ప్రత్యేక ప్రార్థన అనంతరం సోమవారం గంధోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జామే మసీదులో ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. కార్యక్రమంలో హషీం సుత్తారి, ఖాజా చౌశ్, పర్వేజ్, మహమూద్, జాఫర్ సాబ్, మోహసిన్, మహబూబ్ అలీ, ఖాదర్ భాష తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా మరణం తీరని లోటు



సాయిబాబా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

తాడూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రొఫెసర్ సాయిబాబా మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము భరత్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అంతారంలో సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. దళిత గిరిజన, దివ్యాంగ, పౌర హక్కుల ఉద్యమాలకు అనేక రకాల సేవలు సాయిబాబా అందించారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం అన్యాయంగా ఆయనపై ఉప చట్టం మోపి తొమ్మిదేళ్ల జైలుకు పంపి కనీసం అనారోగ్యంతో ఉన్నా వైద్య సేవలు అందించకుండా దారుణంగా వ్యవహరించడం జరిగిందన్నారు. కేంద్రం ఒత్తిడితో ఆయనను జైలు అధికారులు అనేక చిత్రహింసలు, నరకయాతనకు గురి చేశారన్నారు. చిత్రహింసల వల్లే అనారోగ్యానికి గురై చనిపోయారని, ఇది ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వ హత్యేనని అన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, రాము, వెంకటయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు ఉపాధ్యాయులకు పాఠశాలల కేటాయింపు

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2024లో ఎంపికై నియామక ఉత్తర్వులు అందుకున్న 210 మంది కొత్త ఉపాధ్యాయులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలు కేటాయించినట్లు జిల్లా విద్యాధికారి గోవిందరాజులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారిలో 129 మంది ఎస్జీటీలు, 13 మంది భాషా పండితులు, 66 మంది వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులు ఉన్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ నియామక పత్రాలతో సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

17న సామూహిక వ్రతాలు

కందనూలు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కాలనీలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో గురువారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు భక్తులతో నిర్వహిస్తున్నట్లు రామాలయ ప్రధాన అర్చకుడు కందాడై వరదరాజన్ అయ్యంగార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరమాసహిత వెంకట సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులందరికీ వారి పేరిట గోత్రనామాలతో సంకల్పం చెప్పనున్నట్లు తెలిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎంపిక

చారకొండ, అక్టోబరు 14: లంబడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడలో నిర్వహించిన సమావేశంలో సంఘం వ్యవస్థాపకుడు గణేష్ సమక్షంలో నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని మర్రిపల్లితండాలోని గైరాన్‌తండాకు చెందిన డేగవాత్ లస్కర్‌నాయక్‌ను ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకుడు నియామకపత్రాన్ని ఆయనకు అందజేశారు. రాష్ట్ర కమిటీ ఆదేశానుసారం లంబాడి హక్కుల కోసం తన వంతుగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చారకొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ వెంకటరెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ ద్వారా వ్యక్తిగత వివరాలు ఓటీపీ, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా నెంబర్లు తదితర విషయాలు అడిగితే చెప్పొద్దని అన్నారు. రోడ్లపై ఆకతాయిలు ఎవరైనా వేధింపులకు పాల్పడిన, గ్రామాల్లో కొత్త వ్యక్తులు కనిపించిన 100కు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండి ఇతరులకు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుళ్లు నాగయ్య, తిరుమలరావు, కానిస్టేబుల్ ఏడుకొండలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం

- ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి
- వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



నెల్లికొండ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పని చేస్తుందని, పండించిన ప్రతీ గింజను మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని నెల్లికొండ మార్కెట్ యార్డులో నాగర్‌కర్నూల్ ప్రాథమిక సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో దళారుల ప్రమేయం లేకుండా మద్దతు ధరతో రైతుల ప్రయోజనాలను కాపాడాలని అధికారులకు సూచించారు. వరి ఏ-రకం వడ్లను రూ.2,320 బీ-రకంకు రూ.2,300తో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. అలాగే సన్నరకం వడ్లకు ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లిస్తుందన్నారు. మార్కెట్‌లో మోసాలకు పాల్పడితే సహించేంది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ సింగిల్ విండో ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు, సీఈవో శ్రీనివాసులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణకు ప్రాధాన్యత

నాగర్‌కర్నూల్ టౌన్: మునిసిపాలిటీ పరిధిలోని 22, 23 వార్డుల్లో సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి సోమవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ సుందరీకరణకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పట్టణంలోని రోడ్డు పనులను చేపడుతున్నామన్నారు. గతంలో ప్రభుత్వ పరిపాలన అనుమతులు లేకుండానే కొన్ని రోడ్డు పనులు ప్రారంభించి, కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంతో పనులకు మధ్యలోనే వదిలేశారని విమర్శించారు. గతంలో చేసిన తప్పిదాలు కాకుండా పట్టణాభివృద్ధికి స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తీగల సునేంద్ర, నిజాముద్దీన్, బచ్చన్నయాదవ్, పద్మమ్మ, సుల్తాన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

కల్వకుర్తి, అక్టోబరు 14: నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో సోమవారం తిమ్మాజిపేట మండల కాంగ్రెస్ నాయకులు కలిసినట్లు తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శి మాధవులు, శ్రీనివాస్ బహదూర్, ఉస్మాన్, లక్ష్మీనారాయణ ఎమ్మెల్యేతో గ్రామాల్లో నెలకొన్న పలు అంశాలను చర్చించడం జరిగిందన్నారు. ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను పట్టించుకోవడం లేదని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, మందుల కొరతపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు.

వాలీబాల్ విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అమ్రాబాద్, అక్టోబరు 14: మండలంలోని వంగరోనిపల్లిలో దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు సోమవారం ఎమ్మెల్యే వంశీకృష్ణ బహుమతులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ .. నల్లమల ప్రాంతానికి చెందిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొనాలని సూచించారు.

తాగునీరు కలుషితం కావొద్దు

ఊర్కొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో తాగు నీరు కలుషితం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కార్యదర్శులకు ఎంపీడీవో కృష్ణయ్య ఆదేశించారు. సోమవారం ఊర్కొండపేటలలో తాగునీటి సరఫరా, పంచాయతీ రికార్డులు, పల్లె ప్రకృతి వనం, వన నర్సరీలను పరిశీలించారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించిందని పంచాయతీ కార్యదర్శులు, కార్మికులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీవో నర్సింహులు, పంచాయతీ కార్యదర్శి ఇబ్రహీం తదితరులు ఉన్నారు.

అదనపు చార్జీల వసూలు తగదు

కొల్లాపూర్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా హైదరాబాద్ నుంచి వస్తున్న ప్రయాణికుల నుంచి ఆర్టీసీ బస్సుల్లో అదనపు చార్జీలు వసూలు చేశారని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దేవని కుమార్ మాదిగ సోమవారం ప్రకటనలో ఆరోపించారు. కొల్లాపూర్ నుంచి ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్‌కు కనీస చార్జీ రూ.260 అయితే, రూ.390 తీసుకున్నట్లు తెలిపారు. దీపావళి పండుగకు అదనంగా చార్జీలు పెంచితే జిల్లాలో ఉన్న ప్రతి డిపో ఎదుట ధర్నాకు దిగాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

తీర్థయాత్రకు వెళ్లిన వృద్ధుడి అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : తీర్థయాత్రకు వెళ్లి న వృద్ధుడు మిరి యాల వెంకటేశ్ అదృశ్యం కావడంతో కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ సోమవారం తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన మిరియాల వెంకటేశ్ ఈ నెల 7వ తేదీన ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ తీర్థయాత్ర కోసం వెళ్లి తిరిగి రాలేదు. వెంకటేశ్‌కు సంబంధించిన ఫోన్ పనిచేయకపోవడంతో అతని బావ గంధం వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

కోడేరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బావాయిపల్లికి చెందిన నిరంజన్ గాయపడి చికిత్స పొందడంతో ఎన్‌వీ ఫౌండేషన్ ఛైర్మన్ నక్క వేణుగోపాల్‌యాదవ్ సోమవారం ఇంటికెళ్లి రూ.ఐదు వేల ఆర్థిక సాయం చేశారు.

కల్వకుర్తిటౌన్: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన జంగమ్మ సోమవారం మృతి చెందింది. మునిసిపల్ ఛైర్మన్ ఎడ్మ సత్యం పరామర్శించి రూ.5వేలు అందజేశారు.

వైభవంగా దుర్గామాత శోభాయాత్ర



కొల్లాపూర్ పట్టణంలో జరిగిన దుర్గామాత శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

కొల్లాపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా కొల్లాపూర్ పట్టణంలోని వరిదేల శమీ వృక్ష అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో 14వ వార్షికోత్సవ సందర్భంగా సోమవారం చివరి రోజు చండీ యాగం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మ వారి శోభాయాత్రను పట్టణంలో వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో చివరి రోజు పూర్ణాహుతి పెద్ద మంగళహారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

నిమజ్జనానికి తరలిన దుర్గమ్మ విగ్రహాలు

అచ్చంపేట టౌన్: దసరా ఉత్సవాల సందర్భంగా పది రోజులు పూజలందుకున్న అమ్మవారు సోమవారం నిమజ్జనానికి తరలివెళ్లాయి. పట్టణంలో చివరి రోజు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీరామనగర్ కాలనీలో చీరల వేలంపాటలో రూ .1.50 లక్షలకు పలువురు దక్కించుకున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యుడు కోట యాదగిరి తెలిపారు.

వంగూరు: మండలంలో నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారికి అలంకరించిన పట్టు చీరలు, ముక్కుపుడక, వడ్డానంలకు సోమవారం వేలం పాటు నిర్వహించగా రూ.4.43 లక్షలు పలికాయి. మండలం కోనాపూర్‌లోని హనుమాన్ ఆలయంలో ఆజాద్ యవజన సంఘం ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు.



శోభాయాత్రకు హారతి ఇస్తున్న మహిళలు